ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
19-09-2024
గురువారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 18 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB
జయభేరి



# ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశం

## సూక్ష్మ, చిన్న, మధ్య తరహ పరిశ్రమలకు చేయూత

## కొత్త పాలసీని ప్రకటించిన రేవంత్

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

ప్రతి విద్యార్థికీ ఉపాధి కల్పించే విధంగా రాష్ట్రంలో పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఎంఎస్ఎంఈ పాలసీ 2024ని బుధవారం విడుదల చేశారు. 'చాలామంది విద్యార్థుల్లో డిగ్రీలు ఉన్నా పరిశ్రమలకు తగిన నైపుణ్యం ఉండడం లేదు. విద్యార్థుల్లో స్కిల్ అప్‌గ్రేడేషన్ చేయడానికి కృషి చేస్తున్నాం. నూతన విధానాలు రూపకల్పన చేయకుండా రాష్ట్రం అభివృద్ధి చెందదు. పరిశ్రమలకు గత ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీలను చెల్లిస్తాం. కొవిడ్ వ్యాక్సిన్ తయారీలో కూడా తెలంగాణ ముందుంది. ఐటీ, ఫార్మా అభివృద్ధికి కాంగ్రెస్ ఎంతో కృషి చేసింది. ప్రతి ఏడాది లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారు. అందరికీ ఉపాధి కల్పించేలా చర్యలు చేపడుతున్నాం.' అని సీఎం పేర్కొన్నారు.ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు MSMEలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రేవంత్ తెలిపారు. 'రాష్ట్ర సంపదను పెంపొందించాలనే MSME పాలసీ2024ను ఆవిష్కరించాం. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు మంత్రి శ్రీధర్ బాబు గొప్ప ఆలోచన చేయడం అభినందనీయం. గత ప్రభుత్వ విధానాలను కొనసాగిస్తూనే... కొత్త పాలసీని ముందుకు తీసుకెళ్తాం. రాష్ట్ర ప్రయోజనానికి విఘాతం కలిగించే అంశాలను తొలగించేందుకు మా ప్రభుత్వం వెనక్కు తగ్గదు. రాష్ట్రంలో 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చాం.

...మిగతాది 2 లో

# మరోసారి అమెరికాకు మోడీ

## ప్రధానిని కలుస్తానంటున్న బైడన్



**జయభేరి, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18:**

అగ్రరాజ్యం అమెరికాలో అధ్యక్ష పదవి కోసం ఓ రేంజ్ లో పోటీ జరుగుతోంది. మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ .. కమలా దేవి హారిస్ ల మధ్య మాటల యుద్ధం కూడా ఓ రేంజ్ లో సాగుతోంది. తాజాగా డోనాల్డ్ ట్రంప్ మన దేశం ప్రధాని నరేంద్ర మోడీని అద్భుతమైన వ్యక్తి అంటూ ప్రసంశల వర్షం కురిపించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిచిగాన్‌లో జరిగిన ర్యాలీలో ప్రసంగిస్తూ.. త్వరలో ప్రధాని నరేంద్ర మోడీని కలుస్తానని చెప్పారు. అయితే ర్యాలీలో భారత్ వాణిజ్య విధానాన్ని ట్రంప్ విమర్శించారు.. అదే సమయంలో ప్రధాని మోడీని అద్భుతమైన వ్యక్తి అంటూ కొనియాడారు. వచ్చే వారం మోడీ తనను కలవడానికి వస్తున్నారని ట్రంప్ అన్నారు. వాస్తవానికి ట్రంప్ ఆ దేశ అధ్యక్షుడు కానప్పటికీ.. విదేశీ దేశాధినేతలను కలుస్తూనే ఉన్నారు. జూలైలో ఫ్లోరిడాలో హంగేరియన్ జాతీయవాద ప్రధాన మంత్రి విక్టర్ ఓర్బన్‌ను కూడా కలిశారు. ఈ వారంలో ప్రధాని మోడీ అమెరికాలో పర్యటించనున్నారు.క్వాడ్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ప్రధాని మోడీ డెలావేర్‌లోని విల్మింగ్టన్‌కు వెళ్తున్నారు. ఇది అధ్యక్షుడు జో బిడెన్ స్వస్థలం. క్వాడ్ సమావేశం కూడా ఇక్కడే జరగేటట్లు ప్రతిపాదించబడింది. ఈ సమావేశానికి ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, జపాన్ ప్రధాని కిషిడా ఫుమియో కూడా హాజరుకానున్నారు.ఈ క్వాడ్‌లో భారతదేశం, జపాన్, ఆస్ట్రేలియా, అమెరికా దేశాలు సభ్యులు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న చైనా జోక్యాన్ని ఎదుర్కోవడానికి ఈ సంస్థ ఏర్పడింది. అమెరికా అధ్యక్షుడు జో బిడెన్ ఈ క్వాడ్ సమితీ రూపశిల్పి. అధ్యక్షుడిగా ఇదే బిడెన్ చివరి శిఖరాగ్ర సమావేశం. ప్రధాని మోడీ సెప్టెంబర్ 21 నుంచి 23 వరకు మూడు రోజుల పాటు అమెరికాలో పర్యటించనున్నారు. ముందుగా డెలావేర్‌లోని విల్మింగ్టన్‌కు చేరుకుని అక్కడ క్వాడ్ సమ్మిట్‌లో పాల్గొంటారు. దీని తరువాత.. ప్రవాస భారతీయుల సమాజ సమావేశంలో ప్రధాని మోడీ పాల్గొని అక్కడ ప్రసంగించనున్నారు.

...మిగతాది 2 లో

# ముందే హ్యాండ్స్ అప్పా...

## 47 స్థానాల్లో 19 కమలం పోటీయేనా...

**జయభేరి, శ్రీనగర్, సెప్టెంబర్ 18:**




దాదాపు 10 సంవత్సరాల తర్వాత జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నాయి. 2014లో జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు నిర్వహించారు. ఆ ఎలక్షన్స్ లో పీడీపీ 28 సీట్లు గెలిచింది. భారతీయ జనతా పార్టీ 25 అసెంబ్లీ స్థానంలో ఘన విజయం సాధించింది. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో పిడిపి, బిజెపి కలిసి సంయుక్తంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.. అయితే ఆ తర్వాత విభేదాలు పొడ చూపడంతో పీడీపీ, భారతీయ జనతా పార్టీ కటీఫ్ చెప్పుకున్నాయి. నేతలు ఎవరి దారి వారు చూసుకున్నారు. ఆ తర్వాత భారతీయ జనతా పార్టీ త్రిబుల్ తలాక్ ను రద్దు చేసింది. అదే జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో గణనీయమైన మార్పును చూపించింది. ఆ తర్వాత ఆర్టికల్ 370 ని రద్దు చేసింది. అది జమ్మూ కాశ్మీర్లో పెను సంచలనానికి కారణమైంది. దీంతో ఈసారి జరిగే

...మిగతాది 2 లో





# వదర బాధితులకు అత్యుత్తమ ప్యాకేజీని అందజేస్తున్నాం

- కృష్ణా బురమేరు వరదల వల్ల నష్టపోయిన ప్రతి ఇంటికి రూ.25 వేల ఆర్థిక సాయం..
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు..

**జయభేరి, అమరావతి:**

రాష్ట్ర చరిత్రలో కనీ వినీ ఎరుగని విధంగా కృష్ణా బుడమేరు వరదలు సంభవించి విజయవాడ నగరాన్ని అతలాకుతం చేసినప్పటికీ, కేవలం పది రోజుల్లో అందరి సహకారంతో నగరంలో పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ వరధ వల్ల నష్ట పోయిన ప్రతి ఒక్క కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకునేందుకు అత్యుత్తమ ప్యాకేజీని రూపొందించి అమలు చేయడం జరుగుతుంది అంటూ ప్యాకేజీ వివరాలను ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎప్పుడు లేని విధంగా భారీ స్థాయిలో కురిసిన వర్షాల వల్ల కృష్ణా నదిలో 11.43 లక్షల క్యూసెక్కుల

...మిగతాది 2 లో



# రష్యాలో కొత్త పిలుపు


## జనాభా కోసం కొత్త ఆఫర్

**జయభేరి, మాస్కో, సెప్టెంబర్ 18:**

కొన్నిసార్లు ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చే పిలుపులు చాలా ఆశ్చర్యకరంగా ఉంటాయి. దేశంలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రకరకాల చర్యలు తీసుకుంటూ ఉంటుంది. అయితే జనాభా తగ్గిపోతుండటం అనేది ఏ దేశానికైనా పెద్ద ఎదురుదెబ్బగా మారుతుంది. అందుకే పెళ్లిళ్లు చేసుకోండి, పిల్లల్ని కనండి అంటూ చాలా ప్రభుత్వాలు.. ప్రజలను ప్రోత్సహిస్తూ ఉంటాయి. ఈ క్రమంలోనే తాజాగా రష్యా ప్రజలకు వ్లాదిమిర్ పుతిన్ ప్రభుత్వం ఇచ్చిన సూచన వింటే షాక్ అవుతారు. రష్యాలో జననాల రేటు పడిపోతుండటంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన పుతిన్ సర్కార్.. ప్రజలకు కీలక సూచన ఇచ్చింది. లంచ్, కాఫీ బ్రేక్‌లలో శృంగారంలో పాల్గొనాలని వింత సూచన చేసింది. ఇప్పుడు ఇదే తీవ్ర చర్చకు దారి తీస్తోంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తాజాగా చేసిన వ్యాఖ్యలు.. ఆ దేశంలో చర్చకు దారితీశాయి. రష్యాలో

...మిగతాది 2 లో

# రాజీవ్ గాంధీ విగ్రహంపై రాద్ధాంతం...



**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 18:**

అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య విమర్శలు, ప్రశ్నలు సహజం. ఆరోపణలు కూడా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండటం ప్రజాస్వామ్యానికి అవసరం. ప్రజలకు జవాబుదారీగా ప్రభుత్వాన్ని నిలబెట్టడం.. తప్పు చేస్తే ప్రజా కోర్టులో బోనెక్కించడానికి ప్రతిపక్షం పని చేయాలి. కానీ, ప్రతిపక్షం అయినంత మాత్రానా ప్రభుత్వంపై

...మిగతాది 2 లో



# ఒకే దేశం..

## ఒకే ఎన్నికలు నివేదికకు మోదీ కేబినెట్ ఆమోదం

**జయభేరి, న్యూ ఢిల్లీ:**

ఒకే దేశం ఒకే ఎన్నికలు మోదీ చిరకాల స్వప్నం ఈ విధానంపై అధ్యయనం చేయటానికి నియమించిన మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవిద్ కమిటీ నివేదికకు. కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దేశవ్యాప్తంగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను ఒకేసారి నిర్వహించటానికి ఈ కమిటీ చేసిన సిఫార్సులను మోదీ ప్రభుత్వం ఆమోదించింది. మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో జమిలీ ఎన్నికల వన్ నేషన్= వన్ ఎలక్షన్, బిల్లుకు సెంట్రల్ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో లోక్ సభ, రాజ్య సభలో ప్రవేశ పెట్టనున్నారు. ఈ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపి చట్టరూపం దాలిస్తే. దేశంలో 100 రోజుల్లోనే లోక్ సభ, అసెంబ్లీ, లోకల్ బాడీ ఎన్నికలు జరగనున్నాయి.

మొదటిపేజీ తరువాయి

## ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశం

టాటా ఇన్స్టిట్యూట్‌తో కలిసి సంయుక్తంగా రూ.2400 కోట్లతో ఆధునీకరిస్తున్నాం. పూర్తి అధ్యయనం తరువాత యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం అందించేలా యువతకు శిక్షణ ఇందులో శిక్షణ ఇవ్వనున్నాం. యూనివర్సిటీ నిర్వహణకు పారిశ్రామికవేత్తల నుంచి రూ.300 కోట్ల నుంచి రూ.500 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయబోతున్నాం. రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసి వ్యవసాయం పండగ అని నిరూపించాం. ఫ్యూచర్ సిటీలో లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఫార్మా ఏర్పాటు చేయబోతున్నాం. MSMEలు బలపడితేనే రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. MSMEలకు మా ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుంది.' అని పేర్కొన్నారు.దేశ ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నప్పుడు పీవీ నరసింహారావు చేసిన కృషిని మనం జ్ఞాపకం చేసుకోవాలని.. ప్రపంచంతో పోటీ పడేలా ఆయన ఆర్థిక విధానాలు తీసుకొచ్చారని సీఎం రేవంత్ తెలిపారు. పీవీ ప్రధాని అయ్యాక సరళీకృత విధానాలు వచ్చాయని అన్నారు. 'విధానాల రూపకల్పనలు లేకుండా రాష్ట్రం అభివృద్ధి చెందదు. యువతలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల పెంపు కోసం కృషి చేస్తున్నాం. యువతకు వ్యవసాయం, పరిశ్రమల్లో పెట్టుబడి పెట్టేందుకు తగిన చేయూతనిస్తాం. వ్యవసాయ రంగంలో యువత ఎదిగేలా ప్రోత్సహిస్తున్నాం. వ్యవసాయం అనేది దండగ కాదు.. పండగ అనేది మా ప్రభుత్వ నినాదం. రూ.18 వేల కోట్ల నిధులు విడుదల చేసి రైతుల రుణాలు తీర్చాం. తెలంగాణ రాష్ట్రం వర్ధిల్లిన విస్తరాకును తలపిస్తోంది. పరిశ్రమలకు అవసరమైన భూమి, నీరు, ఆర్థిక సాయం అందిస్తాం. మూసీ నది వీక్షణకు పర్యాటకుల సంఖ్య పెరిగేలా అభివృద్ధి చేస్తాం. ప్రభుత్వ పాఠశాలలను ఎంతో మెరుగుపరుస్తున్నాం.' అని సీఎం వివరించారు.అనంతరం సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 19942004 మధ్య చంద్రబాబు ఐటీ విప్లవాన్ని తీసుకొచ్చారని, ఆ తర్వాత అధికారం చేపట్టిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి దానిని కొనసాగించారన్నారు. మంచిపనులు ఎవరు ప్రారంభించినా.. వాటిని కొనసాగిస్తామని పేర్కొన్నారు. 1960లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐడీపీఎల్ వల్ల రాష్ట్రంలో ఫార్మా రంగం వృద్ధి చెందిందని సీఎం పేర్కొన్నారు. మాధాపూర్ లాంటి చిన్న గ్రామం కూడా ఈ రోజున ప్రపంచానికి డెస్టినేషన్ గా మారిందని తెలిపారు. పీవీ నరసింహారావు ఓపెన్ ఎకానమీకి శ్రీకారం చుట్టారని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పటిష్టతకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఇప్పుడు పారిశ్రామిక వేత్తలకు తెలంగాణ వడ్డించిన విస్తరిలా ఉందన్నారు. ఫ్యూచర్ సిటీ కోసం వేగంగా అడుగులు వేస్తున్నామని, పరిశ్రమలకు అవసరమైన నీరు, విద్యుత్ నిరంతరాయంగా అందిస్తున్నామని తెలిపారు. మూసీని కూడా ప్రపంచ పర్యాటకులు వచ్చి చూసేలా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పుడిప్పుడే అమెరికా, సౌత్ కొరియా వంటి దేశాల నుంచి సంస్థలు పెట్టుబడి పెట్టేందుకు వస్తున్నాయని వివరించారు.ప్రస్తుతం రాష్ట్రంలో ఐటీఐలను మరింత టెక్నాలజీతో అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, అందుకోసం రూ.2,400 కోట్లతో టాటా సంస్థతో కలిసి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్నిరంగాలు అభివృద్ధి చెందుతున్నా.. వ్యవసాయరంగం మాత్రం ఇంకా వెనుకబడే ఉందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. రైతులకు రుణమాఫీ చేసినా వారి కష్టాలు తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కుటుంబంలో ఉన్నవారంతా వ్యవసాయాన్నే నమ్ముకోవద్దని, ఇతర రంగాల్లోకి కూడా రావాలని సీఎం సూచించారు. వ్యవసాయం దండగ కాదు.. పండుగ అనేదే తమ విధానమన్నారు. ఈ ప్రభుత్వం గడీల మధ్య లేదని, అందరి సమస్యలను పరిష్కరించేందుకు సర్కారు కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు...

## ముందే హ్యాండ్స్ అప్పా...

ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. జమ్ము కాశ్మీర్లో ప్రజలకు మెరుగైన భద్రత కల్పించామని.. స్వేచ్ఛ వాయువులు పీల్చుకునే అవకాశం ఇచ్చామని..లాల్ చౌక్ లో జాతీయ జెండాను ఎగరవేశామని బిజెపి నాయకులు చెబుతున్నారు.. మరోవైపు అమర్ నాథ్ యాత్రలో భక్తులకు భద్రత కల్పించాల్సిన దుస్థితి నెలకొందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఇలా సవాళ్లు, ప్రతి సవాళ్ల మధ్య తొలి దశలో ఎన్నికలు జరుగుతున్నాయి. తొలి దశలో 24 సెగ్మెంట్లకు ఎలక్షన్స్ నిర్వహిస్తున్నారు.. 24 సెగ్మెంట్లలో 16 కాశ్మీర్ వ్యాలీలో ఉన్నాయి. మిగతా ఎనిమిది జమ్మూ కాశ్మీర్ డివిజన్లో ఉన్నాయి.జమ్ము కాశ్మీర్లో జరిగే ఎన్నికల్లో కమలం పార్టీకి కష్టకాలం ఎదురవుతోందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కాశ్మీర్ లోయలో 47 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. 19 మంది అభ్యర్థులను మాత్రమే బిజెపి పోటీలోకి దింపింది. అంటే 28 స్థానాలలో బిజెపి పోటీ చేయడం లేదు. వాస్తవానికి ఆర్టికల్ 370 రద్దు తర్వాత కాశ్మీర్లో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని బిజెపి నాయకులు అంటున్నారు. అని వాస్తవ పరిస్థితి అలా లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. శ్రీవల్లి పార్లమెంటు ఎన్నికల్లో జంబుకాశ్మీర్ రాష్ట్రంలో బిజెపి అభ్యర్థులను పోటీలో నిలపలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో సగం కంటే తక్కువ స్థానాలలో అభ్యర్థులను పోటీలో ఉంచడంపై రకరకాల వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.." ముందుగా మేము ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేదు. టికెట్ ఇచ్చినా మీరు ఎన్నికల్లో నెగ్గే పరిస్థితి లేదు. ఇది మా పార్టీ అధిష్టానం నుంచి మాకు వ్యక్తమైన సందేశం. అందువల్లే మాకు చాలా ఇబ్బందిగా ఉంది. బలహీనంగా ఉన్న స్థానాలలో అభ్యర్థులను నిలిపే అవకాశం లేదని పార్టీ అధిష్టానం నిర్ణయించిందని" పేరు రాయడానికి ఇష్టపడని బిజెపి నాయకుడు పేర్కొన్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి కాశ్మీర్ లోయలో అభ్యర్థులను పోటీలో ఉంచలేదు. ఇక జంబులోని రెండు పార్లమెంట్ స్థానాలను బిజెపి దక్కించుకుంది. జమ్ము కాశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 ని నరేంద్ర మోడీ ప్రభుత్వం 2019లో రద్దు చేసింది. ఆ సమయంలో కాశ్మీర్ లోయలో చాలా రోజులు నిరసనలు వ్యక్తమయ్యాయి. సమ్మెలు చోటుచేసుకున్నాయి. ఆందోళనలో తగ్గించడానికి భద్రత దళాలు బందోబస్తు పటిష్టం చేశాయి..ఆర్టికల్ 370 ని రద్దు చేసిన తర్వాత కాశ్మీర్ లోయలో శాంతి ఏర్పడిందని.. సాధారణ జీవితం ఏర్పడిందని బిజెపి ప్రకటించింది. లోయ ప్రాంతంలో తీవ్రవాదుల కదలికలు తగ్గిపోయాయని.. ప్రజలు స్వేచ్ఛ జీవితానికి అలవాటు పడుతున్నారని వివరించండి. ఈ ఏడాది మార్చి నెలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శ్రీనగర్ ప్రాంతంలో పర్యటించారు. ర్యాలీ నిర్వహించారు.. అయినప్పటికీ ఆ ప్రాంతంలో బిజెపి అభ్యర్థులను నిలబెట్టలేదు. ఏకంగా 28 స్థానాలలో అభ్యర్థులను నిలపకపోవడం సరికొత్త విశ్లేషణలకు కారణమవుతోంది. ఇదే విషయంపై బిజెపి జమ్ము కాశ్మీర్ అధికార ప్రతినిధి ఆల్తాఫ్ ఠాకూర్ స్పందించారు. " అసెంబ్లీ ఎన్నికలు మాకు ఒక పరీక్ష లాంటివి. ప్రస్తుత పరిస్థితుల్లో మేము విజయం సాధిస్తే వచ్చే కాలంలో పోటీలో దిగుతాం. కాశ్మీర్ లోయలో కమలం వికసిస్తుందని నమ్మకం మాకుంది. ఏడు స్థానాలను గెలుచుకుంటామని భావిస్తున్నాం. తక్కువమంది అభ్యర్థులను నిలపడం మా వ్యూహాల్లో ఒకభాగమని"ఆయన వివరించారు.

## రష్యాలో కొత్త పిలుపు

జననాల రేటు రోజురోజుకూ పడిపోతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేసిన పుతిన్.. సంతానోత్పత్తిని పెంచాలని సూచించారు. ఇందులో భాగంగానే రష్యా ప్రజలు.. పనివేళల్లో భోజన విరామం, కాఫీ విరామాల్లో శృంగారంలో పాల్గొనాలని పేర్కొన్నారు. తద్వారా దేశ జనాభా రేటు క్షీణతను తగ్గించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రష్యాలో స్థిరమైన జనాభా కోసం సంతానోత్పత్తి రేటు ఒక మహిళకు 2.1గా ఉండగా.. ఆ దేశంలో ప్రస్తుతం 1.5గా మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలోనే పుతిన్ ఈ సూచన చేశారు. అయితే రష్యాలో జనాభా పెరుగుదల ఆవశ్యకతను గతంలో పుతిన్ గుర్తు చేశారు.రష్యా ప్రజల సంరక్షణ అనేది తమ దేశ జాతీయ ప్రాధాన్యత అని పుతిన్ వెల్లడించారు. రష్యాఉక్రెయిన్ యుద్ధం కారణంగా 10 లక్షలకు పైగా యువకులు రష్యాను వీడినట్లు తెలుస్తోంది. ఓవైపు.. సంతానోత్పత్తి రేటు తగ్గడం, మరోవైపు.. యువత దేశాన్ని వీడటంతో పుతిన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక రష్యాలో తగ్గుతున్న సంతానోత్పత్తిపై ఆ దేశ ఆరోగ్య మంత్రి డాక్టర్ యెవ్జెనీ షెస్టోపలోవ్ స్పందించారు. చాలా మంది జనం.. పిల్లల్ని కనేందుకు వెనక్కి తగ్గుతున్నారని.. అయితే జీవితం తొందరగా ముగుస్తుందని గుర్తు చేశారు. అందుకే రోజుకు 12 నుంచి 14 గంటలు పని చేసేవారు కూడా తమకు దొరికిన కాస్త బ్రేక్ సమయంలోనైనా సంతానోత్పత్తి పెంచేందుకు సెక్స్‌లో పాల్గొనాలని ప్రజలకు సూచించారు.1999 జూన్‌లో రష్యాలో లక్ష కంటే తక్కువగా జననాలు నమోదు అయ్యాయి. అయితే అంతకుముందు గణాంకాలతో పోలిస్తే అదే కనిష్టం కావడం గమనార్హం. ఇక యూరో న్యూస్ రష్యా యొక్క అధికారిక గణాంకాల ఏజెన్సీ రోస్‌స్టాట్ ప్రకారం.. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మొదటి 6నెల్లలో 16వేల కంటే తక్కువ జననాలు నమోదయ్యాయి. మరోవైపు.. జనాభా క్షీణత 18శాతం అదనంగా పెరిగిందని పేర్కొంది. ఈ ఏడాదిలోనే 49వేల మరణాలు సంభవించగా.. అందులో ఉక్రెయిన్‌రష్యా యుద్ధం కారణంగానే అధికంగా మరణాలు సంభవించాయని తెలిపింది.

# వరద బాధితులకు అత్యుత్తమ ప్యాకేజీని అందజేస్తున్నాం

మొదటిపేజీ తరువాయి

వాటర్ రావడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం అన్నారు. నిజానికి ఈ ప్రాజెక్టు 11.09 లక్షల క్యూసెక్కుల వాటర్ డిశ్చార్జ్ చేసే విధంగా రూపొందించడం జరిగిందన్నారు. తొలి ఆనకట్టు 100 సంవత్సరాల క్రింద, ప్రస్తుత ప్రాజెక్టు 75 సంవత్సరాల క్రింద నిర్మించి దాదాపు 175 సంవత్సరాల పురాతనమైన ఈ ప్రాజెక్టుకి ఒకేసారి 11.43 లక్షల క్యూసెక్కుల వాటర్ రావడం భారీ విపత్తుకు కారణం అయిందన్నారు. అదే సమయంలో బుడమేరు కూడా పొంగడం వల్ల విజయవాడ నగరంలోని పలు ప్రాంతాలు జలమయం అవ్వడంతో పాటు దాదాపు ఏడు రోజుల పాటు 67 అడుగుల మేర నీరు నగరంలోని పలు ప్రాంతాల్లో నిలిచిపోవడం జరిగిందన్నారు. అదే విధంగా తమ హయాంలో ప్రారంభించిన బుడమేరు ఆధునీకరణ పనులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం కూడా మరొక కారణం అన్నారు. బుడమేరు పరీవాహక ప్రాంతం పూర్తిగా దురాక్రమణలు, కబ్జాలు గురవ్వడం మరో కారణమన్నారు. ప్రతి పక్ష పార్టీకి చెందిన వారి బోట్లు ఒక్కోటి 40 మెట్రిక్ టన్నులు ఉండే 3 బోట్లను కృష్ణా నదిలో వదిలిపెట్టడం వల్ల అవి వచ్చి నేరుగా కౌంటర్ వెయిట్ ను ఢీకొట్టడం వల్ల అవి ఇరిగిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. మొన్నటివరకు వాటికి రిపేర్లు చేయడంతో పాటు ఆ బోట్లను తీయడానికి ఎంత కష్టపడటం జరిగిందో అందరూ చూశారన్నారు. రాష్ట్రంలో ఉండే గజ ఈతగాళ్లు, అనుభవం ఉన్నవాళ్లు వచ్చినా తీయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అయినా అన్ని సమస్యలను అధిగమించి తగు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నాతో పాటు మా మంత్రివర్గం, ఉన్నతాధికారులు పది రోజులపాటు రేయింబవళ్లు పర్యవేక్షించడం వల్ల నగరంలో పరిస్థితి సాధారణ స్థితికి వచ్చిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు ఈ నెల 20 వ తేదీకి పూర్తవ్వక ముందే ఇంత గొప్ప విపత్కరమైన పరిస్థితులు ఎదుర్కోవడం జరిగిందన్నారు. వరద విపత్తు నుండి ప్రజలను కాపాడేందుకు తమ ప్రభుత్వం చేసిన అవిరళ కృషిని రాష్ట్రంతో పాటు దేశం మొత్తం గుర్తించిందన్నారు. నేను అహ్మదాబాద్ వెళ్లినప్పుడు ఈ విషయాన్ని అందరూ ప్రస్తావిస్తూ ప్రభుత్వం చేసిన అవిరళ కృషిని ఎంతగానో మెచ్చుకున్నారన్నారు. అదే విధంగా పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పెద్ద ఎత్తున విరాళాలు అందజేస్తున్నారని వారం దరికి పేరుపేరునా రాష్ట్ర ప్రభుత్వం తరపున, 5 కోట్ల ప్రజల తరపున మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

ప్యాకేజీ వివరాలను ఆయన ప్రకటిస్తూ విజయవాడ నగరంలోని 32 వార్డుల్లోని 179 సచివాయాల్లోని



వరద బాదితులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ఆర్థిక సహాయాన్ని అందించడంతో పాటు పాడైపోయిన గృహోపకరణాల మరమ్మత్తుకు తగు చర్యలు కూడా తీసుకోవడం జరుగుచున్నదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజ్ ప్రకారం 32 వార్డుల్లోని 179 సచివాలయాల పరిధిలో గ్రౌండ్ ఫ్లోర్ నీటి మునిగిన వాళ్లందరికీ రూ.25 వేల చొప్పున ఆర్థికసాయం అందజేస్తామని, ఒక ఇంటికి రూ.25 వేలు ఇవ్వడమనేది చరిత్రలో ఇది మొదటిసారన్నారు. ఒకప్పుడు రూ.4 వేల రూపాయలు ఇచ్చిన పరిస్థితి ఉందన్నారు. వరద సమయంలో ఏ ఒక్కరికీ భోజనాల విషయంలో ఏమాత్రము లోటు చేయలేదని, రాయితీపై కూరగాయలు, 25 కేజీల బియ్యం, ఒక కేజీ పామాయిల్, ఒక కేజీ పంచదార, ఒక కేజీ పప్పు, రెండు కేజీల ఉల్లిపాయలు, రెండుకేజీల పొటాటో ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పుడు ప్రతి ఇంటికి రూ.25 వేల ఆర్థికసాయం చేస్తున్నామన్నారు. అదే విధంగా ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్, ఆపైన అంతుస్తుల్లో ఉండే అందరికీ రూ.10 వేల ఆర్థికసాయం చేస్తామన్నారు. వరదలో నీటమునిగిన ఇతర ప్రాంతాలకు చెందినవారికి కూడా రూ.10 వేలు సాయం అందజేస్తామన్నారు. కిరాణా షాపులు, టీ కొట్లు వంటి షాపులున్న అందరికీ రూ.25 వేల సాయం అందిస్తాజేస్తామన్నారు.

అదేమాదిరిగా రిజిస్టర్ చేసుకున్న ఎంఎస్ఎంఈలకు టర్నోవర్ రూ.40 లక్షల కంటే తక్కువ ఉంటే వాళ్లందరూ జీఎస్టీ ఫైల్ చేయాల్సిన పనిలేదని, జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకోనివాళ్లకి రూ.50 వేలు ఇస్తామన్నారు. అదే సమయంలో ఎంఎస్ఎంఈలు రూ.40 లక్షల నుంచి రూ.1.5 కోట్లు టర్నోవర్ ఉన్నవాళ్లకి రూ.లక్ష ఇస్తామన్నారు. అదేసమయంలోరూ.1.5కోట్లు ఆపైన ఉంటే రూ.1.5 లక్షలు ఇస్తామన్నారు. టూవీలర్స్ కు ఇన్సూరెన్స్ క్లెయిమ్, రిపేర్లు చేసుకునేందుకు సహకరిస్తున్నామన్నారు. ఇప్పటివరకు రూ.71.50 కోట్లకు క్లెయిమ్ కు సంబంధించి 9,088 వెహికల్స్ క్లెయిమ్స్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. వీటిలో 2,345 క్లెయిమ్స్ సెటిల్ అయ్యాయని, రూ.6.21 కోట్లు అందజేయడం జరిగిందన్నారు. 6,748 క్లెయిమ్స్ పెండింగ్ ఉన్నాయని, ఇందుకు రూ.65.29 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయిపోయిందన్నారు. విపత్తుల నిర్వహణకై కేంద్రం ఇచ్చిన కలామిటీ ఫండ్ దాదాపు రూ.2 వేల కోట్ల ఖర్చు పెట్టి వాటికి ఎటువంటి లెక్కలు చూపకపోవడం వల్ల కేంద్ర నుండి రావాల్సిన నిధులు ఆగిపోవడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం పోలవరం నిధులతో పాటు పంచాయతీ రాజ్ లో ఫైనాన్స్ కమిషన్ డబ్బులు రూ.990 కోట్లు డైవర్ట్ చేయడం జరిగిందన్నారు. ఎంతో కష్టకాలంలో రూ.990 కోట్లు ఇచ్చి రూ.1,100 కోట్లు మళ్లీ తీసుకురావడం జరిగిందన్నారు. రూ.1650 కోట్లు ధాన్యం ఇచ్చిన రైతులకు బకాయిలు ఉంటే అవి మేమే చెల్లించిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రూ. 10.50 లక్షల కోట్లు అప్పుతో పాటు పెద్ద ఎత్తున పెండింగ్ బిల్లు చెల్లించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రూ.518 కోట్లు తక్షణమే విడుదల చేయాలని కేంద్రానికి లేఖ రాస్తున్నామన్నారు.

అదే విధంగా పాత్రికేయులు అడిగిన పలు ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాదానం చెపుతూ ముంపుకు గురైన ప్రాంతాల్లో ప్రస్తుతం నివశిస్తున్న బాదితులకు మరియు కౌలు దారులకు ఈ ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుంది స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో విశాఖ ఉక్కును ప్రైవేటీకరించకుండా చూస్తామన్నారు. గతంలో తమ హయాంలోనే విశాఖ స్టీల్ స్టీల్ ప్లాంట్ కు అవసరమైన ఆర్థిక సహాయన్ని కేంద్ర నుండి తీసుకు రావడం జరిగిందన్నారు. అదే విధంగా ఈ సారి కూడా కేంద్రం నుండి తగిన ఆర్థిక సహాయాన్ని పొందేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను లాభాలబాట పట్టించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు సాంకేతికంగా, లాజిస్టిక్, పరిపాలన పరంగా ఉన్న సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేందుకు ఉద్యోగులు కూడా సహకరించాల్సి ఉందన్నారు.

అమరావతిపై విమర్శలు చేస్తున్న ఈ తెలివైన మేధావులు చెన్నై, బెంగళూరు, ముంబై, హైదరాబాద్ సిటీలను మార్చేయమని చెప్పండన్నారు. అమరావతిపై ఎందుకు విషం కక్కుతున్నారని ఆయన ప్రశ్నించారు? తిరుపతి, నెల్లూరు, కర్నూలు, రాజమహేంద్రవరంలకు వరదలు వచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

## దళితులపై ఇంత కర్కశత్వమా..?

### జూపల్లిపై కేటీఆర్ ఫైర్

జయభేరి, హైదరాబాద్ సెప్టెంబర్ 18:

దళితులపై చిర్రుబుర్రులాడిన ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జటప్రోల్ గ్రామంలోని సమీకృత గురుకుల పాఠశాల భవనం కోసం దళితుల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంచుకుంది. ఈ నేపథ్యంలో అన్యాయంగా మా భూమిని తీసుకోవద్దని న్యాయం చేయండని వచ్చిన దళితులపై ఇంత కర్కశత్వం ప్రదర్శిస్తారా..? అని కేటీఆర్ మండిపడ్డారు.బాధిత దళిత బిడ్డలు మీ భూములు ఇవ్వాలని అడగలేదు.. వారికి గతంలో ఇచ్చిన భూములను తీసుకోకుండా న్యాయం చేయండని మాత్రమే అడిగారు. అంత మాత్రాన నోరు మూయ్ అంటూ సెక్యూరిటీని పెట్టి పంపిస్తారా? ఇందిరమ్మ రాజ్యంలో దళితులకు న్యాయం చేయరా...? అణిచివేత ఎక్కువైతే తిరుగుబాటు మొదలవుతుందన్న సహజ సూత్రాన్ని మర్చిపోకండి... ఆ దళిత బిడ్డలే మీ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఘోరి కడుతరు అని జూపల్లి కృష్ణారావును కేటీఆర్ హెచ్చరించారు.మంగళవారం సదరు స్థలాన్ని పరిశీలిచేందుకు మంత్రి జూపల్లి రాగా, సర్వే నంబర్ 508లో ఎనిమిది ఎకరాల భూమిని నాటి జటప్రోల్ సంస్థానాధీశులు రాజా జగన్నాథరావు తమకు ఇచ్చారని దళితులు కిష్టన్న, పెంటయ్య, బాలయ్య, బాలపీరు, సంగమయ్య, శేషమ్మ, శాలయ్య, బాలయ్య తెలిపారు. దీంతో మంత్రి నోరు మూయండని బాధితులను బెదిరించారు. సెక్యూరిటీ వారిని అడ్డుకున్నారు. న్యాయం కోసం వస్తే పట్టించుకోలేదని దళితులు ఆవేదన వ్యక్తం చేశారు.

## రాజీవ్ గాంధీ విగ్రహంపై...

అక్కర్లేని ఆరోపణలు, అనవసర రాద్ధాంతాలు చేయాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం ఏ పనికి శ్రీకారం చుట్టినా అడ్డుతగిలి ఆటంకపరచాల్సిన పనీ లేదు. అనవసర వాద ప్రతివాదనలు చేస్తూ ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించడాన్ని ఎవరూ హర్షించరు. ఇప్పుడు విగ్రహంపై బీఆర్ఎస్ చేస్తున్న గొడవపై ఇలాంటి కామెంట్లే వినిపిస్తున్నాయి.కొత్త సచివాలయంలో తాము ఒక ఐలాండ్ ఏర్పాటు చేశామని, అందులో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తాము ఆలోచించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని దశాబ్ద వేడుకల్లో ఆవిష్కరించాలని తాము భావించినట్టు చెప్పారు. ఇక్కడో గమ్మత్తు విషయమేమిటంటే.. బీఆర్ఎస్ ప్రకారం తెలంగాణ దశాబ్ది(నవాబ్ది) ఉత్సవాలు జరిగిపోయాయి. తొమ్మిదేళ్లకే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలంటూ వేడుకలు నిర్వహించింది, అది వేరే విషయం. తెలంగాణ తల్లి విగ్రహం కోసమని.. ఇప్పుడు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఎందుకు అభ్యంతర పెడుతున్నారనేది కాంగ్రెస్ నుంచి వినిపిస్తున్న ప్రశ్న. తెలంగాణ తల్లి కొలువుదీరాల్సిన చోట ప్రతిష్టించిన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని సకల మర్యాదలతో తొలగించి గాంధీ భవన్‌కు పంపుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. వారు ఏం చేసుకున్నా తాము వెనక్కి తగ్గబోమని, తమ ప్రభుత్వం వచ్చాక ఇది చేసి తీరుతామన్నారు.తాము తెలంగాణ తల్లి విగ్రహానికి వ్యతిరేకం కాదని, ఇంకా చెప్పాలంటే.. ఈ డిసెంబర్ 9వ తేదీన ఇదే సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని, అది తమ బాధ్యత అని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేసేశారు. డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ ఏర్పాటుపై నాటి కేంద్ర ప్రభుత్వం తొలి ప్రకటన చేసింది. అదే రోజు సోనియా గాంధీ జన్మదినం కూడా. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఈ రోజే తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ముహూర్తం ఫిక్స్ చేసింది.పదేళ్లు అధికారంలో ఉండి కూడా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయని బీఆర్ఎస్‌కు ఇప్పుడు తాము సచివాలయంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టగానే ఆ విషయం ఎందుకు గుర్తుకు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. నాటి బీఆర్ఎస్ సర్కారు పెట్టకపోయినా తాము తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి తీరుతామని స్పష్టం చేశారు. అలాంటప్పుడు తెలంగాణ తల్లికి అవమానం జరిగిందని, పాలాభిషేకాలతో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనకు పిలుపు ఇవ్వడంతో ఆంతర్యం ఏమిటో వారికే తెలియాలని కాంగ్రెస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి. రాజీవ్ గాంధీ కాంగ్రెస్ నాయకుడనే ఒకే ఒక్క కారణంతోనే బీఆర్ఎస్ ఆయన విగ్రహాన్ని వ్యతిరేకిస్తున్నదని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. కానీ, ఆయన పూర్వ ప్రధాని కూడా.. దేశంలో టెక్నాలజీకి దారులు వేసిన దార్శనికుడని, దేశాభివృద్ధికి పాటుపడిన మహా నాయకుడని, దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన కుటుంబం ఆయనదని ఈ సందర్భంగా వారు గుర్తు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందాలని, గ్రామాలు సాధికారత సాధించాలనే ఆలోచనతో గ్రామ పంచాయతీ వ్యవస్థలో కీలక మార్పులు తెచ్చిన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించడంలో తప్పేమీ లేదని, ఆయన కృషిని స్మరించడంలో పొరపాటేమీ లేదని వివరిస్తున్నారు. బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తున్నదని మండిపడుతున్నారు.

## మరోసారి అమెరికాకు మోడీ

అనంతరం న్యూయార్క్‌లో జరిగే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో పాల్గొననున్నారు.సెప్టెంబర్ 22న ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. ఈ డయాస్పోరా ఈవెంట్ న్యూయార్క్ శివారులోని యూనియన్‌డేల్‌లో జరగనుంది.. ప్రధాని మోడీ పాల్గొనున్న ఈ సమావేశంలో పాల్గొనేందుకు ప్రవాస భారతీయులు 25,000 మందికి పైగా టిక్కెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. AI, క్వాంటం కంప్యూటింగ్, సెమీకండక్టర్, బయోటెక్నాలజీ వంటి అధునాతన రంగాలలో భారతదేశం.. US మధ్య సహకారాన్ని పెంపొందించడానికి ప్రముఖ US కంపెనీల CEOలతో కూడా మోడీ సమావేశం కానున్నారు. 23వ తేదీన యూఎన్ సమ్మిట్ ఫర్ ది ఫ్యూచర్ కార్యక్రమంలో మోడీ పాల్గొనున్నారు.

## మద్యం పాలసీకి కేబినెట్ ఆమోదం

జయభేరి, విజయవాడ, సెప్టెంబర్ 18:

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఉదయం 11 గంటలకు మొదలైంది. సుమారు 4 గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పలు ప్రధాన అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో న్యూ లిక్కర్ పాలసీ నివేదికకు ఆమోదం తెలిపారు. ఇటీవలే బుడమేరు బెజవాడను ముంచెత్తిన విషయం తెలిసిందే. భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా.. బుడమేరుకు మరమ్మతులు, లైనింగ్ పనులు చేయించేందుకు ఆమోదం కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే రేపటి నుంచి రాష్ట్రంలో 75 అన్న క్యాంటీన్లు ప్రారంభం కానుండగా.. వాటిపై కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. గత పాలకుల హయాంలో కీలకంగా ఉన్న వాలంటీర్ల వ్యవస్థపై సుదీర్ఘంగా చర్చించింది.ఏపీలో మందుబాబులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. నాణ్యమైన మద్యం బ్రాండ్లు ఉంచాలని.. సగటు మద్యం ధర రూ.99 నుంచి అందుబాటులో ఉంచాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు నూతన మద్యం పాలసీకి బుధవారం ఆమోదం తెలిపింది...

**ఏపీ కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు**

**కొత్త మద్యం విధానానికి ఆమోదం**

అందుబాటులోకి నాణ్యమైన బ్రాండ్లు, సగటు మద్యం ధర రూ.99గా నిర్ణయం
భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు
వాలంటీర్ వ్యవస్థపై సుదీర్ఘ చర్చ

ఏపీ కేబినెట్ సమావేశానికి ముందు మంత్రి నారా లోకేష్.. ఇతర మంత్రులతో తన ఛాంబర్ లో సమావేశమయ్యారు. ఆయన నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కు మంచి స్పందన వస్తోందని, ప్రజలు తనకు ఇచ్చిన వినతులను సంబంధిత మంత్రులకు అందజేసి.. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

**అక్టోబరు 1 నుంచి కొత్త పాలసీ**

2019 కంటే ముందు రాష్ట్రంలో అమలులో ఉన్న లిక్కర్ పాలసీనే తీసుకు రావాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల కంటే ఎంతో కొంత తక్కువగా మద్యం ధరలు ఉండేలా లిక్కర్ పాలసీ ఉంటుందని చెబుతున్నారు. ఏయే ప్రాంతాల్లో ఎన్ని మద్యం దుకాణాలను నోటిఫై చేయాలి, దరఖాస్తు రుసుములు, నాన్ రిఫండబుల్ ఛార్జీలు, లైసెన్సు రుసుములు ఎలా ఉండాలి? తదితర అంశాలపై ప్రతిపాదనలను గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ ఇప్పటికే అధ్యయనం చేశారు. ఇక వినియోగదారులు కోరుకునే అన్ని బ్రాండ్లూ అందుబాటులో ఉంచాలని మంత్రుల బృందం తీర్మానించింది.

కేబినెట్ ఆమోదం తర్వాత...అక్టోబర్ 1 నుంచి కొత్త మద్యం పాలసీని తీసుకు రానున్నారు.గత ప్రభుత్వ హయాంలో సర్కారీ దుకాణాల పేరుతో జే బ్రాండ్ మద్యాన్ని విచ్చలవిడిగా అమ్మి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు మంత్రి కొల్లు రవీంద్ర. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని క్వాలిటీ మద్యాన్ని సరసమైన ధరలకు అందిస్తామన్నారు.క్షేత్ర స్థాయి అధ్యయనంతో పాటు సీఎం చంద్రబాబు సూచనలతో కొత్త లిక్కర్ పాలసీని రూపొందించామన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా.. మద్యం అమ్మకాలు ఉండబోతున్నాయన్నారు నాదెండ్ల.పక్క రాష్ట్రాల ధరలతో పోటీ పడేలా, అందరికీ అందుబాటులో ఉండేలా, లిక్కర్ పాలసీలో ప్రతిపాదనలు చేశామన్నారు మంత్రి సత్యకుమార్.క్వాలిటీకి పెద్ద పీట వేయడంతో పాటు రేట్లు కూడా మందుబాబులకు అందుబాటులో ఉండేలా కొత్త లిక్కర్ పాలసీ రూపుదిద్దుకుంది.

# పంచాయితీ ఆదాయానికి భారీగా గండి

- ఉద్దేమర్రి గ్రామంలో నిరుపయోగంగా పంచాయితీ షట్టర్లు
- వేలం పాట నిర్వహించకుండా చోద్యం చూస్తున్న ఉన్నతాదికారులు
- చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న ప్రత్యేకాధికారి
- ఓ వ్యక్తి కనుసన్నల్లో కొనసాగుతున్న పంచాయితీ పాలన
- అద్దెకివ్వాలని అడిగిన వారిపై జులుం ప్రదర్శిస్తున్న వైనం



**జయభేరి, సెప్టెంబర్ 18:**
గ్రామాలు దేశానికి పట్టు కొమ్మలు అంటారు. గ్రామ పంచాయితీ కి వివిధ రూపాల్లో ఆదాయాలు సమకూరుస్తు గ్రామ అభివృద్ధికి వెచ్చిస్తారు. అయితే ఆ గ్రామంలో మాత్రం ఇందుకు భిన్నంగా జరుగుతుంది. ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉన్న కూడా దానిని సద్వినియోగం చేసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రి గ్రామంలో గత 2 సంవత్సరాల నుండి గ్రామ పంచాయితీకి సంబంధించిన షట్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. వాటికి అద్దె రుసుము నిర్ణయించడంలో అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారు. అయితే ఈ షటర్లు అద్దెకు కావాలని పంచాయితీ కార్యదర్శిని సంప్రదిస్తే అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడని పలువురు వాపోతున్నారు. గతంలో దాతల సహకారంతో గ్రామ పంచాయితీ కార్యాలయాన్ని నిర్మించారని, కింది అంతస్తులో షట్టర్లు నిర్మించినప్పటికి వాటిని వేలం వేయడానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. అయితే ఈ షట్టర్లు అద్దెకు ఇవ్వాలనీ గ్రామస్తులు, మహిళలు పంచాయితీ కార్యదర్శినీ సంప్రదిస్తే అతను ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తూన్నాడనీ ఆవేదన వ్యక్తం చేశారు. సదరు పంచాయితీ కార్యదర్శి మాట్లాడిన మాటలు ఫోన్ లో సైతం రికార్డ్ అయ్యాయని, వీటిని పై అధికారులకు వినిపిస్తామని వెల్లడించారు. ఇంత జరుగుతున్నా పంచాయితీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు ఎందుకు వెనకంజ వేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. అయితే గ్రామ పంచాయితీ సర్పంచ్ ల పదవీ కాలం ముగిసిన తర్వాత కూడా వారి కనుసన్నల్లోనే పాలన జరుగుతుందని, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయితీలో ఏ పని అయినా లేదా ఏదైనా నిర్ణయం తీసుకోవాలన్న అతని నిర్ణయమే ఫైనల్ అంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇక ఈ షెట్టర్ల అద్దె విషయం గురించి మాట్లాడినా ఇద్దాం లే.. చూద్దాం అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప ఆయన వల్ల ఎటువంటి ప్రయోజనం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై మీడియాలో వార్తలు వెలువడితే ఎందుకు వేస్తున్నారంటు బెదిరింపులకు గురి చేస్తున్నారని బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. అయితే సర్పంచ్ ల పదవీ కాలం ముగిసిన ఆనంతరం ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. అలాగే ఉద్దేమర్రి గ్రామ పంచాయితీ ప్రత్యేకాధికారిగా నియమింపబడ్డ అధికారి వద్దకు వెళ్లి సమస్యను విన్నవించి వేలం పాట వేయాలని కోరిన కూడా ప్రయోజనం లేకుండా పోయిందనీ ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకే ప్రత్యేకాధికారి అని ఈ విషయంలో మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తుందని వారు వాపోయారు. గ్రామానికి ఆదాయ వనరులు చేకూర్చే విధంగా ప్రణాళిక రచించడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైందని వారు మండి పడుతున్నారు. కనీసం గ్రామ పంచాయితీ సిబ్బందికి వేతనాలు సైతం చెల్లించలేని స్థితిలో గ్రామ పంచాయితీ కొట్టుమిట్టాడుతోందనీ వారు ఆవేదన వెలి బుచ్చారు. ఇప్పటికైనా ఉన్నతధికారులు ఈ గ్రామంపై దృష్టి సారించి ఇక్కడి సమస్యలకు పరిష్కార మార్గం చూపెట్టాలని వారు వేడుకున్నారు.



## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, ఆరోగ్య భద్రత కల్పించండి

- ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**
జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి బుధవారం బూర్గుల రామకృష్ణారావు భవన్ లోని ప్రెస్ అకాడమీ ఛాంబర్ లో ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. పెండింగ్ లో ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఆరోగ్య భద్రత వంటి సౌకర్యాలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తాను ముందుండి పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరహత్ ఆలీ పాల్గొన్నారు.

## రికార్డు ధర పలికిన లడ్డూ...

- రూలర్స్ యూత్ ఆధ్వర్యంలో వినాయక లడ్డూ వేలం పాట
- లడ్డూను కైవసం చేసుకున్న రూలర్స్ యూత్ సభ్యులు



**జయభేరి, సెప్టెంబర్ 18:**
మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండల కేంద్రంలో రూలర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించారు. అయితే కని విని ఎరుగని రీతిలో వేలం పాటలో లడ్డూకు రికార్డు దక్కింది. హోరా హోరీగా సాగిన ఈ వేలం పాటలో చివరకు 11,51,111రూపాయలకు రూలర్స్ యూత్ ట్రస్ట్ కైవసం చేసుకుంది. దీంతో అక్కడ కోలహాల వాతావరణం నెలకొంది. కాగా ఈ వేలం పాట ద్వారా వచ్చిన నిధులను కేవలం 10 శాతం మాత్రమే వాడుకొని మిగతా వాటిని సమాజభివృద్ధికి మరియు విద్యా, వైద్య సేవలకు వెచ్చించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు వెల్లడించారు.









## విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

- మైనారిటీ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు అదృశ్యం
- స్టాఫ్ నర్స్ మందలించడంతో విద్యార్థులు భయంతో వెళ్లిపోయారంటున్నా తల్లితండ్రులు
- మైనారిటీ గురుకుల పాఠశాలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్, అడిషనల్ ఎస్పీ

**జయభేరి, దేవరకొండ :**
దేవరకొండ మండల కేంద్రంలోని కొండ భీమనపల్లి గ్రామం వద్ద ఉన్న ప్రభుత్వ మైనారిటీ గురుకుల పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు అదృశ్యమైన ఘటన కలకలం రేపుతుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇదే పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న థౌఫిక్ ఉమర్, ముజీబ్, అబ్దుల్ రహేమాన్ ఈనెల 17వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుండి పాఠశాలలో కనపడకుండా పోయారు, మిలాద్ఉన్నబి రోజు పక్కనే ఉన్న బీసీ గురుకుల పాఠశాల గోడ పైనుంచి ఒక నల్ల ప్యాకెట్ ను విద్యార్థులు తీసుకోవడం, వాటిలో మూడు ప్యాకెట్లు కల్లు ఉండడం గమనించిన స్టాఫ్ నర్స్ జ్యోతి శెట్టి వెంటనే విద్యార్థులను మందలించారని, ఆ తర్వాత తమకు సమాచారం అందించారని ఇన్చార్జి ప్రిన్సిపల్ అశోక్ తెలిపారు.ఉపాధ్యాయ సిబ్బంది మందలించడంతోనే భయాందోళనకు గురైన విద్యార్థులు పాఠశాల నుండి ఎటువంటి సమాచారం లేకుండా లేఖ రాసి పారిపోయారంటూ , వెంటనే చిన్నారుల ఆచూకీ తెలుపాలంటూ వారి తల్లిదండ్రులు రోదిస్తున్నారు. మంగళవారం తప్పిపోయిన విద్యార్థులు ఆచూకీ కొరకు పాఠశాల అధ్యాపక బృందం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది.విషయం తెలుసుకున్న ఆర్ సి ఓ విష్ణుమూర్తి వెంటనే పాఠశాలలను సందర్శించి, సంఘటన వివరాలు తెలుసుకొని పోలీస్ స్టేషన్ కు వెళ్లి మరింత ఆచూకీ కొరకు ఆరా తీశారు.కనబడకుండా పోయిన విద్యార్థుల కొరకు విద్యార్థి సంఘ నాయకులు పాఠశాల ముందు ధర్నా నిర్వహించి తప్పిపోయిన విద్యార్థులను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించాలని, నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయ బృందంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దేవరకొండ మాజీ శాసనసభ్యులు రామావత్ రవీంద్ర కుమార్, అడిషనల్ కలెక్టర్,శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ రాములు నాయక్,ఆర్డిఓ శ్రీరాములు, ఎమ్మార్వో సంతోష్ కిరణ్ పాఠశాలలో సందర్శించి, విద్యార్థులతో వివరాలను అడిగి తెలుసుకొని విద్యార్థులు క్షేమంగా ఉంటారన తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. పాఠశాలలో కల్లు ప్యాకెట్లు ఎలా వచ్చాయో, దానికి బాధ్యులు ఎవరో, పూర్తి సమగ్ర విచారణ జరిపి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ సంఘటనపై





## వృద్ధాశ్రమం కు ఆర్థిక సహాయం అందజేత

- పదివేల రూపాయలు,నిత్యవసర సరుకులు, 25 కిలోల బియ్యం అందజేత.



**జయభేరి, దేవరకొండ :**
దేవరకొండ పట్టణంలోని మహాలక్ష్మి మహిళ వయోవృద్ధ ఆశ్రమంలో పట్టణానికి చెందిన లెంకల త్రినయన్ రెడ్డి చందన ల జన్మదిన సందర్భంగా వారి తల్లిదండ్రులు లెంకల సత్యనారాయణ లక్ష్మి దంపతులు మరియు అక్క బావ కుందూరు దీప్తి వెంకటరెడ్డి కలిసి బుధవారం వృద్ధాశ్రమం నిర్మాణం కొరకు పదివేల రూపాయలు, వృద్ధుల కొరకు నిత్యవసర సరుకులు 25 కిలోల బియ్యం సాయం అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు మాదిరెడ్డి సంధ్యారెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆశ్రమం లేని వృద్ధులకు నీడనిస్తున్న మహాలక్ష్మి మహిళా వయో వృద్ధ ఆశ్రమం నిర్మాణానికి సాయం అందించడం గొప్ప నిర్ణయం అని కొనియాడారు. పెద్దల పట్ల గౌరవ మర్యాదలు కలిగించడం కోసం పిల్లలలో ఆ భావన పెంపొందించడానికి వృద్ధాశ్రమంలో వృద్ధులలో ఒంటరితనాన్ని పోగొట్టడానికి విద్యార్థులతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నామని, పెద్దల సమక్షంలో జరుపుకున్న పుట్టినరోజు వేడుకలు మాకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర భారతి హై స్కూల్ ప్రిన్సిపల్ కే వెంకట్ రెడ్డి, రామకృష్ణ, సుభాన్ అలీ,జమీరుద్దీన్, దీప్తి, అక్షర బేగం, సూపర్వైజర్ జానకి తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో ధర్నా

**జయభేరి, దేవరకొండ :**
బుధవారం రోజున కొండ భీమనపల్లి పరిధిలో ఉన్నటువంటి మైనార్టీ గురుకుల పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు పాఠశాలలో నుండి బయటికి పారిపోయి వారి జడ దొరకని పరిస్థితి చోటుచేసుకుంది. ఈ విషయం తెలిసిన వెంటనే ఏబీవీపీ కార్యకర్తలు అక్కడికి వెళ్లి అక్కడ ఉన్న ప్రిన్సిపల్ ఆర్సిఓతో మాట్లాడి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఈ యొక్క పాఠశాల ప్రిన్సిపల్ ని వెంటనే సస్పెండ్ చేయాలని పాఠశాల ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యలమల గోపీచంద్ మాట్లాడుతూ మైనార్టీ గురుకుల పాఠశాలలో నుండి ముగ్గురు విద్యార్థులు పారిపోవడం ఈ యొక్క పాఠశాలకు సిగ్గుచేటు అంటూ ఈ యొక్క గురుకుల పాఠశాలలో సరైన వసతులు లేకపోవడం విద్యార్థుల పట్ల చిత్త శుద్ధి లేకుండా పాఠశాల యాజమాన్యాలు ప్రవర్తిస్తున్న వారిపట్ల చర్యలు తీసుకోకుండా విద్యాధికారులు విద్యార్థుల సమస్యలు తెలుసుకోకుండా దున్నపోతుపై వాన కురిసినట్టు వివరిస్తున్న ఈ యొక్క అధికారుల వల్ల ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈ యొక్క నల్గొండ జిల్లాలో చూసుకున్నట్లయితే ఇద్దరు మంత్రులు కోమటి రెడ్డి వెంకటరెడ్డి బ్రదర్స్ అని గొప్పలు చెప్పుకుంటారు గానీ విద్యార్థుల పట్ల విద్యార్థుల జీవితాల పట్ల ఎలాంటి శ్రద్ధ శ్రద్ధ లేని పరిస్థితి ఈ యొక్క నల్గొండ జిల్లాలో మనం చూస్తున్నాము గతంలో బిసి గురుకుల పాఠశాలలోనే 13 మంది విద్యార్థులకు ఎలుకలు కరిచినప్పటికీ మరొక గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సరైన భోజనం అందించకుండా వారికి ఫుడ్ పాయిజన్ అయినప్పటికీ హాస్పిటల్ బారిన పడ్డ పరిస్థితి మనకు తెలిసిందే ఈ యొక్క తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల ఎలాంటి శ్రద్ధ లేకుండా నడుస్తున్న ఈ యొక్క ప్రభుత్వం ఉంటే ఎంత లేకుంటే ఎంత అని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సూటిగా తెలియజేస్తుంది. ఈ యొక్క గురుకుల పాఠశాలల మీద వెంటనే సరైన విచారణ జరిపించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఈరోజు డిమాండ్ చేస్తుంది. లేనియెడల రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు M.శివశంకర్, ఆసిఫ్, సిద్ధు, సోయఫ్, భరత్, ఉమర్ ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.






**జనసేన పార్టీ నాయకులు బంజారా సినీ హీరో చందు నాయక్**
మైనార్టీ గురుకుల పాఠశాల నుంచి అదృశ్యమైన పదో తరగతి ముగ్గురు విద్యార్థుల ఆచూకీ చూపి విద్యార్థిల తల్లిదండ్రులకు అప్పగించాలని సేవాలాల్ బంజారా సంఘం జనసేన పార్టీ ఆధ్వర్యంలో చందు నాయక్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు విద్యార్థులకు సమస్యలు అడిగి తెలుసుకొని విద్యార్థులతో కలిసి భోజనం చేయడం జరిగింది అనంతరం సమస్యపై పరిశీలించడానికి వచ్చిన అడిషనల్ కలెక్టర్ కి వివిధ విద్యార్థి సంఘాల తరపునుంచి అడిషినల్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది.

## వేలూరులో అన్నప్రసాద కార్యక్రమం


**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 18:**
సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం వేలూరులో ఎస్సీ కాలనీ లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ యూత్ గణపతి మండపంలో బుధవారం గౌడ సంఘం రాష్ట్ర నాయకులు గుండుకాడి వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ... వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అన్నప్రసాద కార్యక్రమానికి నాకు అవకాశం రావడం దైవకృప అని గణపతి అనుగ్రహంతో అందరూ బాగుండాలని ఆకాంక్షించారు, ప్రతి ఒక్కరూ దైవ భక్తి కలిగి ఉండాలని, గణపతి నవరాత్రి ఉత్సవాలలో భక్తి శ్రద్ధలతో పాల్గొంటున్న యువకులను అభినందించారు, ఈ కార్యక్రమంలో ఎస్సీ కాలనీ లో అంబేద్కర్ యూత్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.






## గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించిన కాంగ్రెస్ నేత

- గ్రామానికి 10 లక్షల చొప్పున కేటాయింపు
- మూడుచింతలపల్లి మండలానికి కోటి రూపాయలను అందచేసిన వజ్రేష్ యాదవ్



**జయభేరి, సెప్టెంబర్ 18:**
మేడ్చల్ నియోజకవర్గం లోని మూడుచింతలపల్లి మండలానికి సిటిజెన్ డెవలప్ మెంట్ కింద నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ కోటి రూపాయలను అందచేసారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామానికి గాను అభివృద్ధి పనుల నిమిత్తం 10 లక్షల రూపాయలను కేటాయించారు. కాగా బుధవారం ఈ నిధులతో ఉద్దమర్రి గ్రామంలోని శ్మశాన వాటికలో బోర్ ను వేశారు. తమ గ్రామానికి నిధులు వెచ్చించిన తోటకూర వజ్రేశ్ యాదవ్ కు గ్రామస్తులు, నాయకులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అదేవిదంగా ఈ నిధులతో గ్రామంలో పెండింగ్ లో ఉన్న పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, మాజీ సర్పంచ్ దోసకాయల వెంకటేష్, విష్ణు గౌడ్, గ్రామ అధ్యక్షులు తుంకి వెంకటేష్, మాజీ సర్పంచ్ పట్ట బాల్ నర్సింహా, ప్రవీణ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంహెచ్ డి గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ నియామకం



**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 18 :**
గజ్వేల్ నియోజకవర్గ మాదిగ హక్కుల దండోరా ఇంచార్జ్ గా సిద్దిపేట జిల్లా ములుగు మండలం క్షీరసాగర్ గ్రామానికి చెందిన దళిత నాయకుడు నల్ల నరెందర్ మాదిగను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన కమిటీల నిర్మాణం బలోపేతం చేయాలని జాతి ఐఖ్యతకు కృషి చేయాలని, మాదిగలు ఎదుర్కొంటున్న వివిధ అంశాల పరిష్కారానికి నియోజకవర్గ స్థాయిలో పనిచేయాలని చెప్పారు.అలాగే గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని మండల కమిటిలు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు డాక్టర్ రామకృష్ణ పెరుమాండ్ల, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికంటి జనార్ధన్, రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్, ఎమ్మెస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు తప్పెట్ల ప్రవీణ్, మహిళా అధ్యక్షులు మతరి రోజారాణి,సిద్దిపేట జిల్లా ఇన్చార్జ్ కొమ్ముల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత జయభేరి



# గణనాధుని నిమజ్జోత్సవం

## చెంగిచెర్ల, ఎమ్ఎల్ఆర్ 4 కాలనీలో ఘనంగా నిమజ్జన వేడుకలు


జయభేరి, మేడిపల్లి, సెప్టెంబర్ 18:
మేడ్చల్ జిల్లా చెంగిచెర్ల, ఎమ్ఎల్ఆర్ 4 కాలనీలో తిరుపతి రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, యుధిష్టర్ గుప్త ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నిమజ్జన వేడుకల్లో భాగంగా లడ్డు వేలం పాట నిర్వహించారు. పోటా పోటీగా సాగిన ఈ వేలం పాటలో చివరకు 3,21,000 వేల రూపాయలకు సురేంద్రనాథ్ కైవసం చేసుకున్నారు. వేలం పాటలో లడ్డు దక్కించుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా తెలిపారు. మహాగణపతి శోభాయాత్ర ప్రారంభమైంది. మహాగణపతికి నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. గణనాధుని నిమజ్జోత్సవం కన్నుల పండుగగా జరిగినది... మహాగణపతి నిమజ్జనాన్ని తిలకించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో కాలనీ జనసంద్రంగా మారిపోయింది. గణపతి బప్పా మోరియా నినాదాలతో పరిసరాలు మారుమ్రోగాయి. మహిళలు నృత్యాలు, కోలాటాలతో గణనాధుని సాధనంప్పినారు. గణేషుడు గంగమ్మ ఒడికి చేరాడు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






సురేంద్రనాథ్ కు అభినందనలు తెలుపుతున్న శశిధర్ రెడ్డి రమేష్ రెడ్డి ఉమా రెడ్డి












# బీటెక్‌లో మిస్సయ్యాను కొంచెంలో..

విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ఈ సినిమా నుంచి 'ఓ పిల్లా..' అంటూ సాగే రెండో గీతాన్ని విడుదల చేశారు. జేక్స్ బిజోయ్ స్వరాలను సమకూర్చిన ఈ పాటను కృష్ణచైతన్య రాయగా.. నకాష్ అజీజ్ ఆలపించారు. 'ఓ పిల్లో..బీటెక్‌లో మిస్సయ్యానే నిన్నే కొంచెంలో.. ఇవాళో, రేపట్లో నిన్నైతే సెట్ చేస్తానే తొందర్లో..' అంటూ రొమాంటిక్ గీతంగా మెప్పిస్తున్నది. విశ్వక్‌సేన్, మీనాక్షి చౌదరి మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంది. కాలేజీ రోజుల్లో తాను ఇష్టపడిన అమ్మాయిని హీరో చాలా ఏళ్ల తర్వాత కలుసుకుంటాడు. ఆ సమయంలో అతని మదిలోని భావాలను ఆవిష్కరిస్తూ ఈ పాటను రూపొందించామని దర్శకుడు తెలిపారు. శ్రద్ధాశ్రీనాథ్, నరేష్, వైవా హర్ష తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, రచనదర్శకత్వం: రవితేజ ముళ్లపూడి.





# మహిళలకు రక్షణ లేదు

మలయాళ సినీరంగంపై జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ అనంతరం ఫిల్మ్ ఇండస్ట్రీలో మహిళలపై లైంగిక వేధింపులు, క్యాస్టింగ్ కౌచ్ అంశాలు మరోసారి తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారంపై పలువురు సినీ తారలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కన్నడ భామ శ్రద్ధా శ్రీనాథ్ సినీరంగంలో క్యాస్టింగ్ కౌచ్, మహిళల భద్రత గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. సినీరంగంలో క్యాస్టింగ్ కౌచ్ జరిగేది నిజమేనని, అయితే తాను మాత్రం అలాంటి చేదు అనుభవాలను ఎప్పుడూ ఎదుర్కోలేదని చెప్పింది. నిజం చెప్పాలంటే సినీరంగంలో కంటే బయటి సమాజంలోనే మహిళలకు రక్షణ కరువైందని అభిప్రాయపడింది. 'ఈ విషయాన్ని అందరూ ఒప్పుకోవాలి. సమాజంలో మహిళలపై దారుణమైన నేరాలు జరుగుతున్నాయి. ఒంటరిగా కారులో వెళ్లాలంటే భయపడే పరిస్థితులు ఉన్నాయి. మహిళలు ఒంటరిగా ప్రయాణం చేస్తూ ధైర్యంగా ఉండలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలి' అని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పుకొచ్చింది. నానితో కలిసి నటించిన 'జెర్సీ' సినిమాతో ఈ భామ తెలుగులో మంచి గుర్తింపును సంపాదించుకుంది. అనంతరం వెంకటేష్ సరసన 'సైంధవ్' చిత్రంలో కూడా నటించింది.



# 'స్పిరిట్'కు 500 కోట్ల బడ్జెట్..

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' పేరుతో భారీ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఆఖరులో షూటింగ్‌ను మొదలుపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'కల్కి'తో ప్రభాస్, 'యానిమల్' సినిమాతో దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా పాన్ ఇండియా స్థాయిలో అద్భుత విజయాల్ని సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి కాంబినేషన్‌పై దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికుల్లో ఆసక్తి పెరిగిపోతున్నది. సినిమాలో ప్రభాస్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. కెరీర్‌లో తొలిసారి ఆయన పోలీస్ పాత్రను చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా బడ్జెట్ గురించి ఓ ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నది. దాదాపు 500 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారని తెలిసింది. హాలీవుడ్ స్థాయిలో యాక్షన్ హంగులు, స్పెషల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దబోతున్నారని, బడ్జెట్ విషయంలో అన్‌కాంప్రమైజ్‌డ్‌గా ఉండాలని దర్శకుడు సందీప్‌రెడ్డి నిర్ణయించుకున్నారని బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్నది.

# వెట్రిమారన్‌తో సినిమా చేయాలి

సామాజిక స్పృహ, సహజత్వం కలబోసిన రా అండ్ రస్టిక్ సినిమాలతో దర్శకుడిగా తనదైన ముద్రతో సాగిపోతున్నారు తమిళ డైరెక్టర్ వెట్రిమారన్. ఇక తిరుగులేని మాస్ ఫాలోయింగ్‌తో మ్యాన్ ఆఫ్ మాసెస్‌గా గుర్తింపు పొందారు అగ్ర హీరో ఎన్టీఆర్. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా కార్యరూపం దాల్చితే అది ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకోవచ్చు. తాజాగా చెన్నైలో నిర్వహించిన 'దేవర' ప్రచార కార్యక్రమం ఎన్టీఆర్‌వెట్రిమారన్ కాంబినేషన్ సినిమా గురించి మరోమారు చర్చకు తెరతీసింది. తమిళంలో స్ట్రెయిట్ సినిమా ఎప్పుడు చేయబోతున్నారు? అది ఏ దర్శకుడితో? అని వ్యాఖ్యాత ఎన్టీఆర్‌ను అడగ్గా...తమిళంలో వెట్రిమారన్ తన ఫేవరేట్ దర్శకుడని, ఆయనతో సినిమా చేయాలన్నది తన డ్రీమ్ అని ఎన్టీఆర్ చెప్పారు. దీంతో వీరిద్దరి కాంబినేషన్ గురించి మరోమారు చర్చలు మొదలయ్యాయి. అయితే నాలుగేళ్ల క్రితమే ఎన్టీఆర్‌తో వెట్రిమారన్ సినిమా చేయబోతున్నారనే వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. లాక్‌డౌన్ తర్వాత తాను ఎన్టీఆర్‌కు స్టోరీ చెప్పానని వెట్రిమారన్ ఓ సందర్భంలో చెప్పారు. అప్పటి నుంచి వీరిద్దరి కాంబినేషన్ గురించి చర్చ జరుగుతూనే ఉంది. ఎన్టీఆర్ తాజా వ్యాఖ్యలతో ఇప్పుడు కాకపోయినా సమీప భవిష్యత్తులో ఈ కాంబినేషన్ కార్యరూపం దాల్చే అవకాశాలున్నాయని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com